# మూడు తప్పులు - ఒక మంచిపని

"ఎందుకు నాన్నా లేచావు ఇంతరాత్రివేళ ?"

సదాశివరావు కొడుకు రాజేంద్ర తండ్రి లేచినచప్పుడు కాగానే లేచి అడిగాడు.

"ఏం లేదురా, దాహమనిపించి లేచాను. మంచంకింద పెట్టిన మంచినీళ్ళ చెంబందుకుని తాగాను."

"అయితే ఇంక పడుకోండి."

"పడుకుంటాను గాని ఇంతచలిగా ఉంటే కిటికీతలుపులన్నీ తెరిచి పెట్టారెందుకు, వేసెయ్యక ?" అన్నాడు.

"ఇది ఏకాలమనుకున్నావు నాన్నా ? గాలి కావాలిప్పుడు. అందుకే తెరిచి పెట్టాను" రాజేంద్ర నవ్వాడు.

"నాన్నలేచారా రాజూ" అంటూ కామేశ్వరమ్మ పక్కగదిలో నుంచి వచ్చింది.

"ఆఁ, మంచినీళ్ళకని లేచాను. ఇంక పడుకోండి" అన్నాడు సదాశివరావు మంచంమీదికి వాలిపోతూ.

వాళ్ళిద్దరూ పడుకున్నారు. కాని, సదాశివరావుకు నిద్రపట్టలేదు. ఆచీకట్లో కళ్ళు చీరికలు చేసుకుని చూస్తున్నాడు గజగజ వణుకుతూ.

మంగమ్మ పిలిచినట్లనిపించింది. లేచి కూర్చున్నాడు.

"ఏనాటి మంగమ్మ ? ఏం సంగతి ?"

అతడి ఒదినెగారు కాశీవెళ్ళి పన్నెండేళ్ళయింది. ఆమె వెళ్ళేటప్పుడు

"కాముడూ, నేను మా చుట్టుపక్కల వాళ్ళందరూ ఒకబస్సు తీసుకుని కాశీవెళ్తుంటే వాళ్ళతో వెళ్తున్నాను. ఒక నెలలోపల వచ్చేస్తాము. దక్షిణదేశయాత్రలు కూడా చెయ్యాలని కొందరంటున్నారు. ఏదయినా ఒక నెల అనుకో. ఈ ట్రంకుపెట్టె మీ యింట్లో ఉంచు. ఇంట్లో బావగారొక్కరూ ఉంటారు, మాతో రమ్మంటే రానన్నారు. నేను తిరిగి వెళ్ళేటప్పుడు తీసుకుంటాను" అని చెల్లెలి ఇంట్లో పెట్టి వెళ్ళింది. అది సామానుగదిలో ఉండేది."

పన్నెండేళ్ళయినా ఆమె తిరిగిరాలేదు.

"ఇంకెంత కాలం కాపాడాలి ఆ రేకు పెట్టెను ?"

''ఇన్నేళ్ళయింది. బతికి ఉంటే రాకపోయిందా ? ఎప్పుడో చచ్చిపోయి ఉంటుంది. శవాన్ని గంగలోకి తోసిఉంటారు తోటి వాళ్ళు" అని అతడి అంచనా.

ఒకనాడు సదాశివరావుకు ఏదో పనిఉండి సామానుగదిలోకి వెళ్ళాడు. ఆ పెట్టె కంటికి కనుపించింది. ''ఆ రేకు పెట్టెలో ఏముంది ? అవతల పారెయ్యక కామేశ్వరి ఇంకా భద్రంగా దాస్తోంది పనిలేక ?" అంటూ దాని తాళం పట్టుకు లాగాడు, తాళం ఊడివచ్చింది. మూత తెరవగానే పాతచీరెలో చుట్టిన మూట ఒకటి అడుగున కనబడ్డది.

"ఆడవాళ్ళు పాతబట్టలయినా మూటలు కట్టి దాస్తారు" అనుకుంటూ చీరెను బయటికి లాగాడు. బరువైన మూటఒకటి ధబ్బున కిందపడ్డది. దాన్ని విప్పిచూసే సరికి కాసులదండ, దండికడియాలూ, చుట్టగాచుట్టిన ఒడ్డ్యాణం కనబడ్డాయి.

సదాశివరావుకు కళ్ళు జిగేల్‌మన్నాయి. వెంటనే మెరుపులాంటి ఆలోచన వచ్చింది. ఆ వస్తువులను ఆగుడ్డలోనుంచి తీసి తన తువాలలో మూటకట్టి, ఎప్పటి మాదిరిగా ఆ గుడ్డలన్నీ పెట్టెలోకుక్కి తాళం తగిలించాడు. దాన్ని కాలితో ఒక మూలకు నెట్టి, దానిమీద పనికిరాని పాతసామాన్లను పడేశాడు.

ఆ మూటను ఎక్కడపెట్టాలని కొంచెంసేపాలోచించాడు. చివరకు తన గదిలో అటకమీద గుండిగ వెనకాల దాచాడు ఎవరికీ కనబడకుండా?

ఆనాటి మంగమ్మ ఇప్పుడు కిటికీలో నుంచి తొంగిచూసినట్లయింది. దిగ్గున లేచి కిటికీతలుపులు మూశాడు. ఆ తరువాత అతడికి నిద్రపట్టలేదు. తెల్లవారే ముందర కళ్ళు మూతలుపడ్డాయి.

రాత్రి కిటికీ తలుపులు ఎందుకుతీశారని కొడుకును కోప్పడ్డాడు.

"నాన్నా ! ఇది మండువేసవి. సాయంకాలం పూట కాస్త చల్లగాలి వస్తుందని నేనే తెరిచాను" అన్నాడు రాజేంద్ర.

"రాత్రి నిద్రలో ఏమన్నానో జ్ఞాపకం లేదురా" అన్నాడు.

మరునాడు పగటివేళ కామేశ్వరమ్మ పడుకుంటుంది. రాజేంద్ర కాలేజికి వెళ్ళాడు. ఇంట్లో ఇంకెవరూ లేరు. సదాశివరావు మెల్లగా తలుపులు దగ్గరగా వేసి బజారుకెళ్ళాడు. వెడల్పు మూతిగల చట్టి, దానికి తగిన మూతకొని తీసుకు వచ్చాడు. ఆ కిందటి రోజున గుండిగ చాటునపెట్టిన నగలమూటను ఆ చట్టిలో పెట్టి తన తువాలలో దానిని మూటకట్టాడు.

కామేశ్వరమ్మ ఇంకా నిద్రలోనే ఉంది.

పెరట్లో తులసికోట వెనకగా ఒక గుంటతవ్వి కుండను ఆ గుంటలోపెట్టి పైన మట్టిపోసి కాళ్ళతో దిమ్మెశ చేసినట్టు నొక్కాడు.

ఈ సంఘటన జరగక ముందు, రాజేంద్ర చిన్నపిల్లవాడుగా ఉన్నప్పుడు, పొద్దున ఆరుగంటలకు పక్కఊళ్ళోగాని దొరకని మందు తీసుకురావాలని సైకిల్ మీద వెళ్తున్నాడు సదాశివరావు.

చలికాలం, ఎవరూ కాలవరేవు దగ్గర అతడికి కనబడలేదు. ఇంకా కొంచెం పొద్దెక్కితే గాని జనం అక్కడికి చేరరు. కాని, సదాశివరావు ఆరేవు దగ్గరికి వచ్చేసరికి ఒక ఆడమనిషి ఒంగి బిందెను నీళ్ళతో కడగటం కనుపించింది. అతడు బురదకాళ్ళు కడుక్కోవటానికి మెట్లుదిగి నీళ్ళ దగ్గరికి వచ్చాడు.

ఆమె బిందెకడిగి నీళ్ళుముంచుకుని తలఎత్తి అతడిని చూసి, "ఈ బిందె కొంచెం నా తలమీదికి ఎత్తుతారా ? బిందెపెద్దది తీసుకువచ్చాను. రెండురోజులు సరిపోవాలని దీన్ని తీసుకువచ్చాను" అంది.

నిర్జనంగా ఉన్న కాలవ ఒడ్డుకు ఒంటినిండా నగలుపెట్టుకుని, ఎనిమిది గంటల బస్సులో ఊరికి వెళ్ళాలని, భర్తకు ఇబ్బంది కాకుండా మంచినీళ్ళు తెచ్చి ఇంట్లో పెట్టిపోదామని, చీకటితోలేచి వచ్చిందామె.

అతడు ముఖమెత్తి ఆమె వంక చూశాడు. ఇంతబరువు మొయ్యగలదా

అనుకుంటూ బిందె ఎత్తుతున్నట్టు ఒంగాడు. ఆ సమయానికి అతడికేమని తోచిందో, చప్పున ఆమె నోరు ఒకచేత్తో మూసి, మరొకచేత్తో మెడలోని హారాలన్నీ తీసుకుని ఆమెను కాలవలోకి తోసేశాడు. కాలవలోకి కొత్తనీరు వచ్చినట్టుంది, మంచి ఉరవడితో ప్రవహిస్తున్నది. ఆ తోపిడికి ఆమె నీళ్ళల్లోపడి ఆ ప్రవాహంలో కొట్టుకుపోయింది. ఎవరో మంచినీళ్ళకని బిందెతో వచ్చి కాలుజారి నీళ్ళల్లో పడిపోయినట్టుగా ఒడ్డున మెట్టుమీద బిందె ఉండిపోయింది.

సదాశివరావు మందు తీసుకుని ఇంటికి వచ్చేసరికి తొమ్మిది గంటలయింది. కాలవదగ్గర జనం మూగి సందడి చేస్తున్నారు. అతడు యింటికి వచ్చేసరికి పిల్లవాడు దగ్గుతెరలతో ఊపిరాడక ఏడుస్తున్నాడు. మందువెయ్యగానే కాస్త సర్దుకున్నట్టుంది నిద్రకొరిగాడు.

ఆ మరునాడు సదాశివరావు కేంపుకు వెళ్ళాడు. ఒక్కరోజేపని. ఆనగలమ్మి ఫిక్సెడ్ డిపాజిట్లు రెండు కొన్నాడు. అంతా ఇరవై ఐదువేల పైచిల్లర.

సదాశివరావుకు మొట్టమొదట ఉద్యోగం వచ్చింది. అతడి స్వంతఊరికి పదిమైళ్ళ దూరంలోఉన్న ఆఫీసులో క్లార్కుగా. ప్రతిరోజూ ఉదయం ఎనిమిది గంటలకు భోజనం చేసి, మధ్యాహ్నానికి టిఫిన్ డబ్బాలో పెట్టుకుని సైకిల్‌మీద ఆఫీసుకు వెళ్తూ ఉండేవాడు. దారిలో తోటలూ పొలాలూ డొంకలూ ఉండేవి.

"జాగ్రత్త నాయనా, ప్రతిరోజూ నీవు వచ్చేటప్పటికి చీకటిపడుతున్నది. దారిలో డొంకలు కూడా ఉన్నాయంటున్నావు. దారిలో పురుగూ పుట్రా చూసుకుంటూ రా'' అనేది తల్లి. ఆ తల్లికి అతడొక్కడే. ఎన్నిదేవుళ్ళకో మొక్కుకోగా పుట్టినవాడు. అపురూపంగా పెంచి పెద్దవాడిని చేసింది. అతడికి ఏ ఆపదా రాకూడదని ప్రతిరోజూ దేవుడికి దణ్ణంపెట్టుకునేది.

ఒకనాడు సదాశివరావు ఆఫీసునుంచి తిరిగివస్తూ ఉండగా మధ్యదారిలో తోటదగ్గర బాటమీద నడుస్తున్నాడు ఒక భూస్వామి. ఏపంటా పండని మెట్టభూమిని అమ్మి, మంచిరేగడి పొలాన్ని కొనాలని డబ్బు షర్టు అడుగునఉన్న బనియన్ జేబులో పెట్టుకుని, నడుస్తున్నాడు, చీకటిపడ్డది. భూస్వామి అదే జేబులోనుంచి చుట్టా అగ్గిపెట్టెలు తీసి వెలిగించుకున్నాడు. పుల్లలయిపోయాయని అగ్గిపెట్టె నవతల పారేసి చుట్టపొగను వదుల్తూ పీలుస్తూ విలాసంగా నడిచిపోతున్నాడు.

పదిగజాల వెనుక సదాశివరావు సైకిల్ మీద వస్తున్నాడు. భూస్వామి చుట్టను బైటికి తీసేటప్పుడు నోట్లకట్ట కిందపడిపోవటం చూసుకోలేదు. ఆ కట్ట సదాశివరావు కంటబడ్డది. వెంటనే సైకిల్ దిగి ఆ కట్ట ఏమిటని చూశాడు సైకిల్ లైటు వెలుగులో. నూరురూపాయల నోట్లు చుట్టగా చుట్టిన కట్ట అది. ఆ కట్టను దారంతో గట్టిగా కట్టినట్టున్నారు.

సదాశివరావు వెంటనే చూసి ప్యాంటుజేబులో పెట్టుకున్నాడు.

భూస్వామి మెల్లగానడుస్తూ ఒక మైలుదూరం తరువాత కుడిచేతి వైపున ఉన్న దారికి మళ్ళాడు.

అంతవరకూ సదాశివరావుకు ఆ కట్టను భూస్వామికి ఇచ్చేయాలనే ఉంది. కాని, అతడు అంత నిర్లక్ష్యంగా వెనక్కయినా తిరిగి చూడకుండా సందులోకి మళ్ళటం చూసి 'రేపు చూద్దాంలే' అనుకుని సైకిల్ స్పీడ్ పెంచి ఇంటికి వెళ్ళిపోయాడు. తల్లి పెట్టిన వేడినీళ్ళు స్నానంచేశాడు.

"వేళయింది నాయనా భోజనం చేస్తావా!" అడిగింది తల్లి.

జేబులో పెట్టుకున్న రూపాయలకట్టనొకసారి చేత్తో తడిమిచూసుకుని భోజనంచేశాడు.

ఒకరాత్రివేళ నిద్రలేచి లాంతరు వెలుగున ఆ రూపాయలకట్ట బైటికితీసి లెక్కబెట్టాడు. పదిహేనువేలరూపాయలు. అన్నీ నూరురూపాయలనోట్లు చుట్టచుట్టి నట్టుగా చుట్టిఉన్నాయి.

పాపం! ఆ భూస్వామి సదాశివరావుకు వెళ్ళేటప్పుడో వచ్చేటప్పుడో దారిలో కనబడుతూ ఉండేవాడు. అప్పుడప్పుడు పలకరిస్తూఉండేవాడు. ఆనాడు అంత సొమ్ము పోగొట్టుకున్నాడనిపించింది- అదీ ఒక క్షణకాలం.

మరుక్షణంలో అతడి మనస్తత్వం 'తనకు దొరికింది కదా- తీసుకుంటే తప్పేమిటిగా' మార్పుచెందింది.

మరునాడు సెలవు. తల్లి తనకు భోజనంపెట్టి పెరట్లో బియ్యం బాగుచేసు కుంటోంది. ఆ సమయంలో సదాశివరావు ఆ డబ్బును ఒక కవరులో పెట్టి తన పెట్టె అడుగున భద్రంగా దాచిపెట్టి తాళంవేశాడు.

తల్లి ఒకటే తొందరపెడుతున్నది. "నాయనా ! ఉద్యోగంకూడా వచ్చింది. ఇంక పెళ్ళిచేసుకో " అంటూ భోజనం చేసేటప్పుడు ముఖ్యంగా తీరికగా ఎదురుగా కూర్చుని "మీనాన్న లేరు. నేనయినా నీపెళ్ళి చూడద్దూ ?" అనేది. అనగా అనగా అతడు సరేనన్న తరువాత కట్నకానుకలు ఇవ్వలేని తన బంధువుల అమ్మాయితో పెళ్ళిచేసింది. మరి నాలుగేళ్ళపాటు వాళ్ళిద్దరి అన్యోన్యతనూ కాపరాన్ని చూసింది. మనుమడు పుట్టిన తరువాత ముద్దూముచ్చటా చూసి చనిపోయింది.

ఆ తరువాత నెలకే సదాశివరావుకు ఆ ఊరినుంచి బదిలీ అయింది.

రాజేంద్ర చదువుకు వచ్చాడు.

సదాశివరావుకు సర్వీసులో ఇంక్రిమెంట్సు ఆపుచేయబడటమూ ప్రమోషన్లు సరిగా రాకపోవటమూ జరుగుతూవచ్చింది. అందువల్ల యు.డి.సి. అయిన కొద్ది కాలానికే రిటైరు కావలసివచ్చింది.

తనుదాచిన డబ్బు పెట్టి డిగ్రీకాలేజీలు ఉన్న ఊళ్ళో ఒకచిన్న ఇల్లు కట్టుకున్నాడు. తనపెన్షను కాక చిన్నపిల్లలకు ట్యూషన్లుచెప్పి, ఆదాయాన్ని వృద్ధి చేసుకుంటున్నాడు.

ఇంతకాలంగా లేని గుబులు సదాశివరావుకు ఇల్లుకట్టుకుని గృహప్రవేశం చేసినప్పటినుంచీ ప్రారంభమైంది. 'ఇది నాయిల్లు. నేను కష్టపడి సంపాదించి కట్టిన ఇల్లు' అన్న సంతోషం కలగటంలేదు.

ఎవరయినావచ్చి "ఏమోయ్ సదాశివం. చిన్నదయినా మంచివసతులేర్పరచి కట్టావోయ్ ఇంటిని అనేవారు. నీకుటుంబానికి తగినట్టుగా నీ ఆదాయానికి తగినట్టుగా మట్టసంగా కట్టుకున్నావు ? అని ఎవరయినా అభినందించగానే పైకి చిరునవ్వునవ్వినా కడుపులో భుగభుగలు. ఇదివరలో అతడిలోఉన్న ఉత్సాహం సంతోషం ఇప్పుడు వెతికినా కనబడటంలేదు.

రాత్రిళ్ళు పడుకోగానే ఇదివరకూ కంటినిండా నిద్రపోయేవాడు. ఇప్పుడు ఆ నిద్ర ఆతడికి దూరమయిపోయింది. కన్నుమూయగానే ఏదోకలవరం-ఉలికిపాటుగా ఉంటోంది, గుండెలో గుబులుగా ఉంటోంది. వాటిని భరించలేక లేచి మంచమ్మీద కూర్చుంటాడు. కాని ఎంతసేపని కూర్చోగలడు ? అర్ధరాత్రివేళ ?

సరిగ్గా ఆవేళకు కొడుకు చదువుకుని పడుకుంటాడు. పగలంతా ఏదో ఒక పని చేసి చేసి ఉన్న భార్య పదిగంటల తరువాత మేలుకొని ఉండలేదు.

అతడు నలుగురిలో ఉన్నా ఒంటరితనంతో బాధపడుతున్నాడు.

అటువంటి సమయంలో మంగమ్మ వచ్చి "యాత్రలుచేసి వచ్చానయ్యా. నా రేకుపెట్టె బయటపెడితే ఇంటికిపోతాను. ఇంకో పావుగంటలో బస్సుంది. ఇల్లు ఒదిలిపెట్టి ఎన్నాళ్ళయిందో? మీఅన్నగారు సరిగా భోజనం చేస్తున్నారో లేదో? ఈపాటికి పెరట్లో పాదులన్నీ ఎండిపోయిఉంటాయి. ఆవు పాలిస్తున్నదో లేదో? త్వరగా వెళ్ళాలి. లేకపోతే బస్సందదు" అంటూ తలుపు తట్టినట్లని పిస్తుంది.

భూస్వామి "దారిలో ఇంకెవరున్నారయ్యా నీవుతప్ప? మూడోమనిషేలేదు. నా డబ్బును నీవే తీసిఉండాలి. ఆ వేళప్పుడు ఆ దారిన వచ్చేవాడివి నీవొక్క-డివే. మర్యాదగా నా డబ్బు నాకిచ్చెయ్యి" అని మీదిమీదికివచ్చి కళ్ళెర్రచేసు కుంటూ కొట్టబోతున్నట్లనిపిస్తుంది. "నేను చూడలేదంటే నమ్మండి. నేను అటు వంటిపనిచేయను. చేయలేదు" అంటూ పరుగెత్తిన ఆయాసంతో కిందపడిపోయి నట్లనిపిస్తోంది అతడికి.

కళ్ళుమూసుకుని తల రెండుచేతులతో పట్టుకుని యమబాధపడుతున్నాడు.

తెల్లవారుఝామున కళ్ళుమూతలుపడే సమయంలో కాలువలోకి తోయబడిన ఆమె తడిబట్టలతో వచ్చి "మా అన్నయ్య పెళ్ళికి వెళ్ళాలని నగలన్నీ పెట్టుకుని మంచినీళ్ళబిందె ఇంట్లో పెట్టిపోదామనివస్తే నగలుతీసుకుని కాలువలోకి తోసేస్తావా? ఎవరో కాళ్ళు కడుక్కో-వాలని వచ్చాడు కాబోలనుకున్నాను. నీకు భార్య- అక్క-చెల్లెలులేరా? వాళ్ళనెవరయినా ఇట్లాచేస్తే నీకేమనిపిస్తుంది? ఊరుకుంటావా?" అని గద్దిస్తూ "ఈ మనిషేనండీ నన్ను- నగలు తీసుకుని కాలువలోకి తోసింది" అని పోలీసులకు చెప్తాను. రా బైటికి" అంటూ కేకలు పెడుతున్నట్టుగా కళ్ళ ఎదుట కనబడుతుందాదృశ్యము.

గజ గజ ఒణికిపోతాడు. ఆ చలికాలంలో ముచ్చెమటలు. అతడికే నమ్మ శక్యం కావటంలేదు.

తనుచేసిన మూడుతప్పులూ ఇలావేధిస్తూఉంటే అతడికి చెమటలుకాక నిద్ర ఎట్లావస్తుంది ?

అన్నంసహించక- రాత్రిళ్ళు కంటినిండా నిద్రలేక పీక్కుపోయిన ముఖంతో ఒకరోజున గుడికివెళ్ళి పూజారితో "రాత్రిళ్ళు పీడకలలువచ్చి నిద్రపట్టటంలేదు. ఆకలి సరిగాలేక అన్నం సహించటంలేదు. ఏంచెయ్యను? అంతా అయోమయంగా ఉంది. ఏంచెయ్యమంటారు ?" అని అడిగాడు.

పూజారికి కొంచెం వైద్యంవచ్చు. గుడికి వచ్చినవాళ్ళు కొందరు మందులు అడిగి తీసుకువెళ్తూ ఉంటారు. సదాశివరావు తనసంగతి చెప్పగానే "ప్రతిరోజునా?" ప్రశ్నించాడు పూజారి.

"అవునండీ రాత్రిళ్ళు 'ఈ రోజయినా సుఖంగా నిద్రపోదామ'ని గంపె డాశతో మంచమ్మీద వాల్తాను. కాని- నిద్రపట్టదు. ఎవరో తలువుతట్టినట్టూ, ఎవరో గద్దించి కొట్టబోయినట్టూ బెదిరించినట్టూ అనిపిస్తుంది. ఇన్నేళ్లొచ్చినా భయంతో ఒళ్ళు జలదరిస్తుంది. వెంటనే లేచికూర్చుంటాను. దయ్యాలూ భూతాలూ అంటే నాకు నమ్మకంలేదు. కాని- రాత్రివేళ 'అవేనా ఆ చప్పుడు చేసేది' అనిపిస్తుంది. మీరు నాకు వైద్యంచేస్తారా ? మీకు జ్యోతిష్యంకూడా వచ్చునని భక్తులు చెప్పగా విన్నాను. నాకేదయినాసరే- నిశ్చింతగా నిద్రపట్టేటట్టుచేయండి" అని చేతులు జోడించాడు

"మీనక్షత్రం ఏమిటి ?"

"నక్షత్రం మెందుకండీ మందుకోసం వచ్చానని చెప్పానుకదా ?"

"నక్షత్రమెందుకంటే మందు ఇచ్చేవాడికీ తీసుకునేవాడికీ జన్మనక్షత్రాలు మిత్రతారలయిఉండాలి. అలాలేకపోతే మందు పట్టివ్వదు'' అన్నాడు పూజారి.

"నా నక్షత్రం నాకుతెలియదు. తెలిసిన మా అమ్మ ఇప్పుడులేదు" సదాశివ రావు తలవంచుకుని ఇంటికివచ్చాడు.

రోజులు అయోమయంగా గడుస్తున్నాయి.

సరిగా భోజనం చెయ్యటంలేదని భార్య గొడవచేస్తున్నది. "మందు తీసు కోండి. డాక్టరు దగ్గరికి వెళ్ళండి" అని పోరుపెడుతున్నది.

ఒకనాడు తనస్నేహితుడి ఇంటికి వెళ్ళివస్తుండగా మధ్యదారిలో ఎవరో హరికథ చెబుతున్నారు. "ఎంతతప్పుచేశాడో అంత మంచిపనిచేస్తే నరుడికి సుఖ సంతోషాలు కలుగుతాయ"ని హరికథలో ఉపకథ చెబుతున్నాడు హరిదాసు.

పుణ్యంలోనుంచి పాపాన్ని తీసివెయ్యాలని చూడటానికి ఇదేమయినా లెక్కలా ? తీసివేతలూ గుణకారాలూనా ? ఇది ఏమనుకుంటున్నావు ? దేనికదే" నని అంతరాత్మ మొరాయిస్తోంది.

కాని అతడు 'ఇదినిజమా ? ఆ మంచిపని ఏమిటి ? ఎట్లాచెయ్యాలి ?'

అందరినీ అడిగాడు 'మంచిపనంటే ఏమిటి ?' అని.

ఈ రోజుల్లో మంచిపనంటే ఏమిటి ? యాత్రలా ? పూజలా ? ఉపవాసాలా? దైవధ్యానమా ? లేక గుడిలో ప్రదక్షిణాలా ?

అతడు సందిగ్ధంలో పడ్డాడు.

ఎంతోమందిని వివరంగా చెప్పమని అడిగాడు.

"మంచిపనంటే పదిమందికీ ఉపయోగపడేది. దానం చెయ్యవచ్చు. ధర్మం చెయ్యవచ్చు. గుడి కట్టించవచ్చు. అది ఇహమూ పరమూను" అన్నాడొకాయన.

"గుడి కట్టించటమంటే మాటలా? ఎంత డబ్బుకావలి? చందాలు విరాళాలు పోగుచెయ్యాలి. ఎంతోమందిని కూడగట్టుకోవాలి. ఎంతకాలానికి కావలసిన డబ్బు పోగవుతుంది ?"

ఈలోపల తనకు నరకయాతన.

ప్రాణం ఉంటుందో పోతుందో?

మాట్లాడకుండా ఇంటికివచ్చాడు.

రోజులు అతికష్టమ్మీద గడుస్తున్నాయి.

ఈలోపల అనేక ఆలోచనలు వస్తున్నాయి. పోతున్నాయి.

"ఈ విశాల ప్రపంచంలో పదిమందికి పనికివచ్చే మంచిపనేమిటో తెలిస్తే నేను చేయలేకపోతానా ?" అనుకున్నాడు.

అతడి స్నేహితుడొకడు "ఒక విద్యార్థికి చదువుచెప్పించు" అన్నాడు.

"ఆ విద్యార్థి ఏ అమెరికావంటి ఊళ్ళల్లోనో ఉండి డబ్బుపంపించు అంటే ఎక్కడినుంచి ఇవ్వగలను ?"

"కన్యాదానంచేస్తే ఎంతోపుణ్యమని పెద్దలంటారు. ఒక పేదపిల్లకు పెళ్ళి చెయ్యి" అన్నాడు మరొక స్నేహితుడు.

"చేస్తే మంచిదేకాని- ఈ రోజుల్లో వేలూ లక్షలూ కావాలంటే నాచేత నేమౌతుంది ? పోనీ పెళ్ళికని కొంతడబ్బుఇస్తే సరిపోతుందా ?" అడిగాడు సదా శివరావు.

"నాయనా, ఏపనిఅయినా సగం సగం చేయకూడదు. తలపెడితే పూర్తిగా చెయ్యాలి. అలా సగంచేస్తే 'అది మంచిపని' అనిపించుకోదు." అని జవాబు వచ్చింది.

"అయితే ఒకపని చెయ్యవయ్యా, గ్రంథాలయం కట్టించు."

"గ్రంథాలయం కట్టించటానికి స్థలంకొనాలి. భవనం కట్టించాలి. పుస్తకాలు కొనాలి. దాన్ని నడిపించాలి. ఈ స్థితిలో నేను ఆ పనిమాత్రం చెయ్యలేను" నీరస పడిపోయాడు సదాశివరావు.

"ఏమిటి నాన్నా ? ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూ ఉంటావు ? అసలు నీబాధ ఏమిటోచెప్పు ?'' అడిగాడు కొడుకు.

ఒకమంచిపని చేయాలన్న తన ఆలోచననుగురించి అంతాచెప్పాడు.

"నాన్నా ! ఎవరికో చదువుచెప్పించేబదులు నాకేచెప్పించు. బి.కామ్ పూర్తి చెయ్యలేదు నేను. అదీ పూర్తిచేస్తాను. ఎం కామ్ చదువుతాను. ఈలోపల ఏదయినా పరీక్షకు కూర్చుని ఐ.పి.యస్., ఐ.ఎ.యస్., ఐ.ఎఫ్.యస్. వంటి పరీక్షలు ప్యాసయితే పెద్దఉద్యోగం వస్తుంది. అప్పుడు నేనే నీకు డబ్బుపంపిస్తాను. అది మంచిపని కాదా నాన్నా ?" అన్నాడు.

సదాశివరావుకు సలహాలు ఎక్కువయిపోయి ఏంచెయ్యాలో తోచక భోజనం చెయ్యకుండా పడుకున్నాడు. తెల్లవార్లూ ఆలోచిస్తూనేఉన్నాడు. ఎవరి సలహాలూ తనకనుకూలంగాలేవు.

'అయితే ఏంచెయ్యాలన్న ప్రశ్న పెద్దరాక్షసిలా' కళ్ళముందర కనబడి నట్లవుతున్నది.

చివరకతడికి అనిపించింది- ఆయింట్లోనుంచి వెళ్ళిపోయి దేవాలయం మండపంలో పడుకుని, తెల్లవారుఝామున కోనేటిలో స్నానంచేసి, ఆగుడిచుట్టూ ప్రదక్షిణాలు చేయాలని, అదీ పదిమందికి ఉపయోగపడే మంచిపనే. తననుచూసి పదిమందీ ప్రదక్షిణాలుచేస్తారు.

అనుకున్నదే తడవుగా తెల్లవారకముందేలేచి కోనేట్లో స్నానంచేసి ఆ తడి బట్టతోనే ప్రదక్షిణాలు రాత్రివరకూ చెయ్యటం మొదలుపెట్టాడు ఆగకుండా. ఎప్పుడైనా పూజారి ఒక అరటిపండో కొబ్బరిముక్కో ఇస్తే తినేవాడు.

అలసిపోయిన సదాశివరావుకు ఏరాత్రికో కళ్ళు మూతలుపడేది. మండపం లోకి చేరుకునేవాడు.

“ఆయనెవరండీ! రోజూ లెక్కలేనన్ని ప్రదక్షిణాలు చేస్తున్నాడు?” పూజారిని ఎవరో భక్తులు అడిగారు.

“అతడా? సదాశివరావని ఈ ఊరివాడే. కాస్త మతిచలించి అలా ఆగకుండా గుడిచుట్టూ ప్రదక్షిణాలు చేస్తూఉంటాడు. అదీ మంచిపనే. మతిచలించినదని ఏపాడుపనో చెయ్యకుండా ప్రదక్షిణాలు చేస్తున్నాడు. ఎవరితోనూ మాట్లాడడు. ప్రదక్షిణాలు చేసిచేసి రాత్రిళ్ళు ఆ మండపంలో పడుకుంటాడు కాపలా కాస్తున్నట్టు” అన్నాడు.

పాపం సదాశివరావు సంగతి ఎవరికీ అంతుపట్టక, పాపం అనుకుంటారు.